బైబులు భాష్యం - 199
నవంబరు - డిసెంబరు 2011

# ప్రాత నిబంధన కథలు - 2

సంపాదకుడు :
**ఫాదర్ పి. జోజయ్య,** S.J.
ఆంధ్ర లొయోలా కాలేజి
విజయవాడ - 520 008
ఫోను - (0866)-2476329

# ప్రాత నిబంధన కథలు-2

## 43. సంసోను విషాద మరణం- *న్యాయాధి 16,23-31*

ఫిలిస్తీయులు వారి దేవుడు డాగోనుకి ఉత్సవం జేసికొంటూ సంసోనుని తమ దేవాలయానికి కొనిపోయారు. అక్కడ అతడు వీరకార్యాలు చేయగా చూచి ఆనందించారు. అతనితో చెలగాటమాడారు. ఆ దేవళం రెండు పెద్ద స్తంభాల మీద నిల్చి వుంది. సంసోనుకి తలజుట్టు మళ్లా పెరిగి నూత్నబలం వచ్చింది. అతడు రెండు స్తంభాలమీద చేతులు ఆనించాడు. దేవుణ్ణి స్మరించుకొని ప్రభూ! ఇంకొక్కమారు నాకు బలాన్ని దయచేయి అని ప్రార్థించాడు. ఆ మీదట ముందుకు వంగి స్తంభాలను బలంగా నెట్టాడు. వెంటనే రెండస్తుల మందిరం పెళ్లున కూలి నేలమీద పడింది. అక్కడ ప్రోగైయున్న మూడు వేలమంది ఫిలిస్తీయులు వారి నాయకులు అందరూ చచ్చారు. వారితోపాటు సంసోనుగూడ గతించాడు. అతడు బ్రతికి వున్నప్పటికంటె చనిపోయినప్పుడే ఎక్కువమంది ఫిలిస్తీయులను చంపాడు. అసలు వారితో పోరాడ్డానికే ప్రభువు అతన్ని న్యాయాధిపతిగా ఎన్నుకొన్నాడు.

## 44. రూతు భక్తి

న్యాయాధిపతుల కాలంలోనే రూతు కూడ జీవించింది. యూదయా దేశంలో కరువు రాగా నవోమి అనే స్త్రీ పెనిమిటితో, ఇద్దరు కొడుకులతో మోవాబు దేశానికి వలసపోయింది. అక్కడ యిద్దరు కుమారులూ మోవాబు పడతులను పెండ్లిచేసికొన్నారు. పెద్దామె ఓర్పా, చిన్నామె రూతు. కాని ఆ దేశంలో నవోమి పెనిమిటీ, ఇద్దరు కుమారులూ చనిపోయారు. ముగ్గురు విధవలు మాత్రమే మిగిలారు. కరువు అంతరించి మళ్లా వానలు కురిసినందున నవోమి స్వీయదేశానికి తిరిగి రాగోరింది. పెద్ద కోడలు పుట్టింటికి వెళ్లిపోయింది. చిన్నకోడలు రూతుమాత్రం అత్తకు అంటిపెట్టుకొని వుండిపోయింది. నేను నీ వెంటనే వస్తాను. నీ బంధువులు నా బంధువులు.

నీ దేవుడు నా దేవుడు. నీవు వసించే చోటనే నేనూ వసిస్తాను. నిన్ను పాతిపెట్టే చోటనే నన్నూ పాతిపెడతారు అంది. కనుక ఆమెకూడ అత్తతో పాటు యూదయా దేశంలోని బేత్లెహేము నగరానికి వచ్చింది. అప్పుడు ఆ దేశంలో యవపంట కోస్తున్నారు.

రూతు జీవనోపాధి కొరకు, పొలాల్లో పరిగలు ఏరుకొంటూండేది. ఒకరోజు బోవసు అనే సంపన్నుని పొలంలోకి ప్రవేశించింది. అతడు ఆమె విదేశీయురాలైన రూతు అనీ, సొంత దేశాన్నీ బంధువులనూ వదలిపెట్టి అత్తపట్ల మమకారం చూపుతుందనీ తెలిసికొన్నాడు. అమ్మా! నీవు మా పొలంలోనే కంకులు ఏరుకోవచ్చు. మా పనికత్తెలు దగ్గరే వుండి మా పనివాళ్లు తెచ్చిన నీళ్లు త్రాగవచ్చు. వారితో పాటే నీవుకూడ భోజనం చేయవచ్చు. మా జనమెవరూ నిన్ను బాధించరు అని చెప్పాడు. రూతు కంకులు ఏరుకొని యింటికిపోయి అత్తకు బోవసు తన్ను ఆదరంతో చూచాడని చెప్పింది. నవోమి అతడు మనకు దగ్గరి బంధువు. మన సంగతిని పట్టించుకోవలసినవాడు అతడే అని చెప్పింది. రూతు యవపంట, గోదుమపంట కోసే కాలమంతా బోవసు పొలంలోనే వెన్నులు ఏరుకొంది.

బోవసు పొలంలోనే కళ్లం తొక్కించి ధాన్యానికి కాపలా కాయడానికి రాత్రి అక్కడే పండుకొని వున్నాడు. అత్త ప్రోద్బలంపై రూతు వెళ్లి అతని పాదాల చెంత పండుకొంది. అర్ధరాత్రి బోవసు మేల్కొని తన కాళ్ల దగ్గర వున్న స్త్రీని చూచి ఆశ్చర్యపోయాడు. రూతు అయ్యా! నీవు నన్ను కరుణించాలి. నన్ను దేవర న్యాయాన పెండ్లాడి నాకు సంతానాన్ని కలిగించు అని వేడుకొంది. బోవసు ఆమెకు ఆరు కుంచాల ధాన్యమిచ్చి ఇంటికి పంపాడు. మరునాడు పెద్దలను చేరబిలచి వారి సమక్షంలో నేను నవోమి కుటుంబానికి చెందిన ఆస్తిని కొంటున్నాను. రూతుని దేవరన్యాయం ప్రకారం పెండ్లిచేసికొంటాను. ఆమెకు కలిగే సంతానం ఈ కొన్నభూమికి వారసులౌతారు అని చెప్పాడు. పెద్దలు అందుకు సమ్మతించారు. తర్వాత రూతు బోవసులకు ఓబేదు, అతనికి యీషాయి అనే బిడ్డలు పుట్టారు.

ఈషాయి కుమారుడే దావీదు. కనుక దావీదుకి రూతు ముత్తవ్వ. సంతానం కలిగి తమ కుటుంబం నశించకుండా వుండడానికిగాను అత్తాకోడళ్లు ఈలా తిప్పలు పడ్డారు. రూతు కథ పుణ్యస్త్రీ కథ.

## 45. అన్నా బిడ్డడి కొరకు వేడుకోవడం - *1సమూ 1-2*

ఎల్కనాకు అన్నా, పెనిన్నా అని యిద్దరు భార్యలు. పెనిన్నాకు బిడ్డలు కలిగారుగాని అన్నా గొడ్రాలుగా వుండిపోయింది. సవతి నీకు పిల్లలు లేరుకదా అని అన్నాను దెప్పిపొడిచేది. ఆమె పిల్లలకొరకు తపించిపోయేది.

ఒకసారి కుటుంబమంతా షిలో దేవాలయానికి యాత్ర వెళ్లింది. అన్నా దేవుని సన్నిధిలోకి వెళ్లి ప్రభూ! నా మనవి ఆలించు. నీవు నాకొక మగబిడ్డణ్ణి ప్రసాదించావంటే వాణ్ణి జీవితాంతం నీ సేవకే సమర్పిస్తాను అని మొక్కుకొంది.

ప్రార్ధనలో అన్నా పెదవులు కదులుతున్నాయిగాని నోట మాటలేదు. దేవళంలో పరిచర్యజేసే పెద్దగురువు ఏలీ ఆమె తప్పతాగి వచ్చిందనుకొని మందలించాడు. అన్నా అయ్యా! నేను త్రాగిరాలేదు. తీరని బాధలో వుండి దేవునికి మనవి చేసికొంటున్నాను అని చెప్పింది. అతడు ఆలాగైతే దేవుడు నీ మొర ఆలిస్తాడు. ప్రశాంతంగా పోయిరా అని ఆమెను దీవించాడు.

అన్నా యింటికి వెళ్లాక గర్భం దాల్చి బిడ్డణ్ణి కని సమూవేలు అని పేరుపెట్టింది. శిశువుకి పాలు మాన్పించిన తర్వాత దేవాలయానికి తీసికొని వచ్చి ప్రభువుకి సమర్పించింది. అతడు దేవాలయంలోనే వుండిపోయి యాజకులు ధరించే నారబట్టలు తాల్చి ఏలీ పర్యవేక్షణం క్రింది ప్రభువుకి సేవలు చేసేవాడు. అన్నా యేటేట బలిసమర్పించడానికి దేవాలయానికి వచ్చేది. వచ్చినపుడెల్ల క్రొత్త అంగీని కుట్టుకొని వచ్చి బాలునికి తొడిగేది. దేవుడు అన్నా భక్తికి మెచ్చి ఆమెకు ఇంకా ఐదుగురు బిడ్డల్ని ప్రసాదించాడు. సమూవేలు దేవళంలోనే పెరిగి పెద్దవాడయ్యాడు. అన్నా దైవభక్తి కల తల్లి.

## 46. సమూవేలుకి పిలుపు - *1సమూ 3*

యూదులు షిలో నగరంలో గుడారం పెట్టుకొని దేవుణ్ణి పూజిస్తుండే

వాళ్లు. ఇంకా రాతిగుడి లేదు. బాలుడైన సమూవేలు దేవళంలో ఏలీకి సహాయం చేస్తుండేవాడు. ఒకరోజు రాత్రి సమూవేలు దేవాలయం గర్భాగారంలో మందసంవద్ద పండుకొని నిద్రపోతున్నాడు. అక్కడ వెలిగే దీపంలో చమురు పోయడం అతని పని. ఏలీ దేవళం మధ్యభాగంలో పండుకొని నిద్రిస్తున్నాడు. అపరాత్రిలో దేవుడు బాలుణ్ణి పిల్చాడు. అతడు ఏలీ దగ్గరికి వచ్చి నీవు నన్ను పిల్చావు గదా, ఇదిగో వచ్చాను అన్నాడు. ఏలీ నేను నిన్ను పిలువలేదు, వెళ్లి పండుకో అని చెప్పాడు. ఈలా మూడుసార్లు జరిగింది. మూడవసారి దేవుడే బాలుణ్ణి పిలుస్తున్నాడని ఏలీ గ్రహించాడు. అతడు నీవు ప్రభువు పలుకులు విని వాటిని నాకు తెలియజేయమని బాలునితో చెప్పాడు. నాల్గవసారి ప్రభువు సమూవేలుని పిల్చి సందేశం విన్పించాడు. ఏలీ కుమారులు దేవళంలో పాపాకార్యాలు చేసి దేవునికి అపకీర్తి తెస్తున్నారు. కనుక దేవుడు అతని కుటుంబాన్ని నాశం జేస్తానని తెలియ జేశాడు. ఆ సందేశాన్ని బాలుడు ఏలీకి విన్పించాడు. తర్వాత ఫిలిస్టీయులతో జరిగిన యుద్ధంలో ఏలీ కుటుంబం నశించింది. అతనికి బదులుగా సమూవేలు షిలో దేవాలయంలో యాజకుడయ్యాడు. పై దర్శనంలోనే అతడు ప్రవక్త ఐపోయాడు. తాను ప్రభువు పలుకులు ఆలించి వాటిని ప్రజలకు తెలియజేస్తుండేవాడు. అతడు ప్రవక్త, యాజకుడు, న్యాయాధిపతి, యుద్ధవీరుడు. ఆ రోజుల్లో ఫిలిస్టీయులు యిస్రాయేలుకు ప్రబల శత్రువులు. కనుక సమూవేలు ప్రజలను వారిమీదికి యుద్ధానికి తీసికొని పోతుండేవాడు. అతడు నలభైయేండ్ల పాటు జనానికి నాయకుడుగా మెలిగి వారిని దైవమార్గాల్లో నడిపించిన భక్తుడు.

### 47. దేవుడు సౌలు రాజుని నిరాకరించడం *-1సమూ 13,15*

యావే ఆజ్ఞప్రకారం సమూవేలు సౌలుకి మొదటి రాజుగా అభిషేకం చేశాడు. ఆ రాజు మొదట బాగానే పరిపాలించాడు గాని రానురాను దేవుని ఆజ్ఞలు మీరుతూ వచ్చాడు. అతడు మిక్మాసువద్ద ఫిలిస్టీయులతో యుద్ధం జేస్తున్నాడు. సమూవేలు నేను ఏడు రోజుల్లో వచ్చి దహనబలి సమర్పించి దేవునికి ప్రార్థన చేస్తానని చెప్పాడు. కాని అతడు గడువు ప్రకారం రాలేదు.

సౌలు శత్రువులకు దడిసి తొందరపాటుతో దహనబలిని తానే సమర్పించాడు. కాని అతడు యాజకుడు కాదు. బలి ముగిశాక సమూవేలు వచ్చి కోపించాడు. నీవు దేవుని ఆజ్ఞ మీరావు కనుక నీకు బదులుగా మరొకడు రాజవుతాడని చెప్పాడు -1సమూ 13,7-14.

సౌలు అమాలెకీయులతో యుద్ధం జేస్తున్నాడు. కాని యుద్ధంలో గెల్చాక వారి రాజైన అగాగును చంపివేయలేదు. వారి జంతువులను శాపం పాలుచేసి వధించలేదు. సౌలు అతని అనుచరులు మేలైన పశువులను తామే దక్కించుకొన్నారు. ఈ కార్యాలు ప్రభువు ఆజ్ఞకు విరుద్ధం. కనుక సమూవేలు కోపించి నీవు యావే ఆజ్ఞలు త్రోసి వేశావు గనుక ప్రభువు నిన్ను రాచరికం నుండి త్రోసివేశాడు అని చెప్పాడు -1సమూ 15. ఈలా అవిధేయతవల్ల సౌలు రాజు రాజపదవిని కోల్పోయాడు.

### 48. రెండవరాజుగా దావీదుకి అభిషేకం - *1సమూ 16,1-13*

ప్రభువు సమూవేలుతో నీవు బేత్లెహేము వెళ్లి యీషాయి కుమారుల్లో వొకణ్ణి రెండవరాజుగా అభిషేకించు అని చెప్పాడు. యీషాయి తన పెద్దకొడుకు ఎలీయాబును ప్రవక్త యెదుటికి కొనివచ్చాడు. అతని ఆకారం బాగా వుంది. పైగా జ్యేష్ఠుడు. కనుక ప్రవక్త దేవుడు ఇతన్నే యెన్నుకొని వుండాలి అనుకొన్నాడు. కాని దేవుడు నరుని రూపాన్నిగాక హృదయాన్ని గమనించేవాడు. అతడు ఎలీయాబును ఎన్నుకోలేదు. తర్వాత తండ్రి మిగిలిన ఆర్గురు కుమారులను గూడ ప్రవక్త యెదుటికి కొని వచ్చాడు గాని దేవుడు వారిలో ఎవ్వరిని ఎన్నుకోలేదు. ప్రవక్త వచ్చినప్పుడు దావీదు ఇంటిపట్టున గూడ లేడు. పొలంలో గొర్రెలు కాచుకొంటున్నాడు. తండ్రి అతన్ని పిలువనంపాడు. దావీదు రాగానే ప్రభువు ప్రవక్తకు ఇతన్ని అభిషేకించు అని చెప్పాడు. సమూవేలు అన్నల యెదుట ఒలీవతైలంతో దావీదుకి అభిషేకం చేశాడు. ఆనాటినుండి దేవుని ఆత్మ అతన్ని ఆవేశించి యుద్ధ వీరుణ్ణిగా తయారుచేసింది. ఏడ్గురు అన్నలను కాదని దేవుడు

కడగొట్టు వాడయిన దావీదుని ఎన్నుకొన్నాడు. ప్రభువు తనకు నచ్చిన వారిని తన సేవకు పిలుస్తాడు.

## 49. దావీదు గొల్యాతుని జయించడం – *1సమూ 17*

యిస్రాయేలీయులు ఫిలిస్టీయులు ఎలా లోయలో యుద్ధానికి తలపడ్డారు. ఫిలిస్టీయుల వీరుడు గొల్యాతు. అతని పొడవు తొమ్మిది అడుగులు. కత్తి, డాలు, ఈటె, బల్లెం మొదలైన ఆయుధాలు ధరించి రాక్షసుళ్లాగ వచ్చాడు. అతనితో పోరాడ్డానికి యిస్రాయేలీయుల్లో ఎవరూ సాహసించలేదు. బాలుడైన దావీదు నేను పోరాడతానని ముందుకు వచ్చాడు. సౌలురాజు మొదట అంగీకరింపకపోయినా వేరే వ్యక్తి దొరకనందున దావీదుని అనుమతించాడు. పోరాడేది ఇద్దరు వీరులే. గెల్చిన వీరుని పక్షం వాళ్లు గెల్చినట్లు. గొల్యాతు యుద్ధంలో కాకలు తీరిన యోధుడు. దావీదు పసివాడు. అతని ఆయుధాలు ఒడిసెల, ఐదురాళ్లు మాత్రమే.

గొల్యాతు దావీదుని చిన్నచూపు చూచి నిందించాడు. అతడు ఏ సౌలు లాంటి గొప్ప వీరుడో తనతో పోరాడ్డానికి వస్తాడనుకొన్నాడు. దావీదుని చంపి వన్యమృగాలకు ఆహారంగా వేస్తానని డంబాలు పల్కాడు. దావీదు నీవు ఆయుధాలతోను మానుషబలంతోను వచ్చావు. కాని నేను యావే పేరుమీదిగా వచ్చాను. నాది దైవబలం అని పల్కాడు. ఇద్దరు వీరులు డీకొన్నారు. దావీదు ఒడిసెలను గిరగిరత్రిప్పి రాయి విసిరాడు. అది తిన్నగా దూసుకొని పోయి గొల్యాతు నొసటిని చీల్చి లోపలికి చొచ్చుకొని పోయింది. ఆ రాక్షసుడు మొదలు నరికిన తాటిచెట్టు లాగ గబీలున నేలమీద కూలాడు. అతడు సొమ్మసిల్లి పడిపోయాడే గాని ఇంకా చావలేదు. దావీదు గబగబా గొల్యాతు దేహంమీదికెక్కి అతని కత్తితోనే అతన్ని పొడిచి చంపాడు. అతని శిరస్సును నరుకుకొని వచ్చాడు. తమ వీరుడు ఓడిపోవడం చూచి ఫిలిస్టీయులు పారిపోయారు. యిస్రాయేలు సైనికులు వారిని వెన్నాడి కొల్లసొమ్ము దోచుకొన్నారు. ఈ విజయం దావీదుకి బాగా పేరు తెచ్చిపెట్టింది.

## 50. దావీదు యోనాతానుల మైత్రి - *1సమూ 18,1-3*

సౌలు కుమారుడు యోనాతాను. అతనికీ దావీదుతో గాఢమైన మైత్రి యేర్పడింది. అతడు తన దుస్తులూ ఆయుధాలూ దావీదు కిచ్చి అతనితో నిబంధనం చేసికొన్నాడు. సౌలు తర్వాత దావీదు రాజౌతాడని యోనాతాను పసికట్టాడు. తాను దావీదు క్రింద రెండవ అధికారిగా మాత్రమే వుంటాడు. ఐనా అతడు దావీదును చూచి అసూయ చెందలేదు. అతన్ని యింకా ప్రోత్సహించాడు. అపాయాలనుండి కాపాడాడు. అతనితో రెండవసారి కూడ ఒడంబడిక చేసికొన్నాడు -23,17-18. వారిది నిస్వార్థమూ ఆదర్శప్రాయమూ ఐన మైత్రి.

## 51. సౌలు అసూయ - సమూ *15,6-11*

దావీదుకి పేరు ప్రఖ్యాతులు రావడం చూచి సౌలు అసూయ చెందాడు. అతన్ని చూచి భయపడ్డాడు. ఒకసారి సౌలు దావీదు ఇద్దరూ యుద్ధంలో ఫిలిస్టీయులను గెల్చి తిరిగివస్తున్నారు. దారిలో స్త్రీలు పాటలు పాడి నాట్యం జేస్తూ వారికి స్వాగతం పల్కారు. వాళ్లు సౌలు వేయిమందిని చంపాడు. కాని దావీదు పదివేలమందిని చంపాడు అని పాడారు. ఆ పాట వినేసరికి సౌలుకి గుర్రుమంది. ఇతడు నాకంటె గొప్ప వీరుడై పోయాడని అసూయ చెందాడు. ఆ మరుసటి రోజు సౌలుకి ఆహ్లాదం కలిగించడానికి దావీదు అతని ముందు సితారా వాయిస్తున్నాడు. సౌలు ఆగ్రహంతో తన చేతిలోని ఈటెను దావీదు మీదికి విసిరాడు. అతన్ని దానితో పొడిచి గోడకు గ్రుచ్చాలని సౌలు తలంపు. కాని దావీదు నేర్పుతో తప్పించుకొన్నాడు. ఈలా రెండుసార్లు జరిగింది.

## 52. కొండగుహలో సౌలు - *1సమూ 24*

దావీదు సౌలునుండి పారిపోయి ఎంగడీ ఎడారిలో తలదాచుకొంటు న్నాడు. అతన్ని పట్టుకోవడానికి సౌలు మూడువేలమంది యోధులతో పయనమైవచ్చాడు. ఆ యెడారిలో ఓ కొండగుహ వుంది. సౌలు మలవిసర్జనకై ఆ గుహలోనికి వెళ్లాడు. అంతకు ముందే దావీదు తన అనుచరులతో ఆ గుహలోనే దాగుకొని వున్నాడు. దావీదు అనుచరులు

ఇదిగో! సౌలు మన చేతికి జిక్కాడు, చంపివేద్దాం అన్నారు. కాని దావీదు మనం దేవుని అభిషిక్తునికి కీడు చేయకూడదు అని చెప్పాడు. అతడు మెల్లగాబోయి సౌలుకి తెలియకుండానే అతని ఉత్తరీయం అంచుని కత్తిరించుకొని వచ్చాడు. సౌలు వెలుపలికి రాగానే దావీదు అతన్ని కలిసికొని ప్రభూ! ఈ బట్టముక్కను చూడు. ఈనాడు నీవు మా చేతికి చిక్కగా నేను నిన్ను చంపలేదు. దేవుడు ఎన్నుకొనిన రాజుకి హాని చేయకూడదని నా విశ్వాసం. నీవు మాత్రం నా మీద అకారణంగా విరోధం పెంచుకొని నన్ను చంపగోరుతున్నావు. నేను నీకు ఏ ద్రోహం చేయలేదు. దేవుడు మనిద్దరికీ తీర్పు తీర్చునుగాక అన్నాడు. ఆమాటలకు సౌలు మనసు కరిగి పెద్దగా ఏడ్చాడు. నాయనా! నీవు నాకంటె యోగ్యుడివి. నేను నీ చేతికి జిక్కగా నీవు నాకు కీడు చేయక మేలే చేశావు. చేజిక్కిన శత్రువుని ఎవడైన వదలిపెడతాడా? దేవుడు నీకు మేలు చేస్తాడు. నీవు రాజువైనపుడు నా కుటుంబాన్ని నాశం చేయనని ప్రమాణం చేయి అని పల్కి దావీదు చేత ప్రమాణం చేయించుకొన్నాడు. తర్వాత సౌలు తన దారిన తాను వెళ్లిపోయాడు.

## 53. నిద్రిస్తూన్న సౌలుని వదలివేయడం – *1సమూ 26*

దావీదు హకీలా కొండల్లో దాగుకొనివున్నాడు. అతన్ని పట్టుకోవడానికి సౌలు మూడువేలమంది బంటులతో వచ్చాడు. అతడు రాత్రి శిబిరంలో పండుకొని నిద్రపోతున్నాడు. దావీదు అతని దగ్గరికి వచ్చాడు. అతనితో పాటు వచ్చిన అబీషయి సౌలుని చంపుదామన్నాడు. కాని దావీదు దేవుని అభిషిక్తుని చంపడానికి వొప్పుకోలేదు. సౌలు ఈటె, నీటికుండ అతని తల ప్రక్కనే వున్నాయి. దావీదు ఆ రెండిటినీ గైకొని గుట్టుచప్పుడు కాకుండ శిబిరం వెలుపలికి వచ్చాడు. అతడు వచ్చిపోయినట్లు అక్కడివారెవరూ గుర్తించలేదు. దావీదు ప్రక్క కొండమీది కెక్కి సౌలునీ అతని సైన్యాధిపతి అబ్నేరుని కేకలువేసి పిల్చాడు. మీ యీటె నీటికుండ ఏమైనవో చూచుకోండి అన్నాడు. రాజుకి సరిగా కాపలా కాయనందుకు

అబ్నేరుని గేలి చేశాడు. నేను నీ ప్రాణాలు తీయగలిగి కూడ తీయలేదు. నీవు నిరపరాధినైన నన్ను కౌజు పక్షినిలాగ తరుముకొనివచ్చావు కదా అని సౌలుని హెచ్చరించాడు. ఆ మాటలకు సౌలు సిగ్గుపడి పశ్చాత్తాపం చెందాడు. ఇక మీదట దావీదుకి ఎట్టి కీడు తలపెట్టనని మాట యిచ్చాడు. అతని సేవకుడు వెళ్లి ఈటెనుగా నీటికుండనూ తీసికొని వచ్చాడు. ఆ పిమ్మట సౌలు వెళ్లిపోయాడు.

### 54. సౌలు మరణం - *1సమూ 31*

గిల్బోవా కొండమీద సౌలుకీ ఫిలిస్తీయులకీ యుద్ధం జరిగింది. శత్రువులు సౌలు మీద బాణాలు గుప్పించగా అతడు బాగా గాయపడి నేలకొరిగాడు. అతడు తన అంగరక్షకుని బిలచి నీ కత్తితో నన్ను చంపు. లేకపోతే ఈ ఫిలిస్తీయులు నామీద బడి నన్ను అవమానిస్తారు అని చెప్పాడు. కాని అంగరక్షకుడు అతన్ని చంపడానికి భయపడ్డాడు. సౌలు తానే తన కత్తి మీదబడి ప్రాణాలు విడిచాడు. అంగరక్షకుడు కూడ ఆలాగే సొంత కత్తిమీద బడి ప్రాణాలు కోల్పోయాడు. యుద్ధంలో సౌలు ముగ్గురు కుమారులు కూడ చనిపోయారు. ఫిలిస్తీయులు వచ్చి సౌలు తలను నరికి ఎత్తుకొనిపోయారు.

### 55. దావీదు యెరూషలేమును జయించడం - *2సమూ5,6-10*

సౌలు తర్వాత దావీదు రాజయ్యాడు. అతడు హెబ్రోనును రాజధానిగా జేసికొని కొంతకాలం పరిపాలించాడు. కాని అతనికి పెద్ద రాజధాని నగరం అవసరమైంది. ఆ రోజుల్లో యెరూషలేము యెబూసీయుల అధీనంలో వుండేది. దావీదు సైనికులు ఆ నగరాన్ని ముట్టడించారు. అక్కడి ప్రజలు మీకీ పట్టణం చిక్కదు. ఇది సురక్షిత నగరం. కుంటివాళ్లు, గ్రుడ్డివాళ్లు కూడ దీనిని కాపాడగలరు అని పల్కారు. ఆ పట్టణానికి నీళ్లుపారే సొరంగం ఒకటుంది. దావీదు సైనికులు రహస్యంగా ఆ సొరంగం గుండా పోయి పట్టణంలో ప్రవేశించి దాన్ని వశం జేసికొన్నారు. దావీదు దానికి దావీదు

నగరం అని పేరుపెట్టి చుట్టూ ప్రాకారం కట్టించి సురక్షితం జేశాడు. అప్పటి నుండి అది యూదులకు రాజధాని నగరమైంది.

## 56. మందసాన్ని యెరూషలేముకి కొనిరావడం – *2సమూ 6,12-22*

ప్రభువు మోషేకు వ్రాసియిచ్చిన పదియాజ్ఞల రాతిపలకలను ఓ మందసంలో వుంచారు. యూదులకు ఆ పెట్టే దైవసాన్నిధ్యం. దావీదు భక్తి భావంతో ఆ పెట్టెకు యెరూషలేములో ఓ గుడారం సిద్ధం జేసాడు దాన్ని యెరూషలేముకి కొనివచ్చాడు. మందసాన్ని యాజకులు మోసికొని వచ్చారు. దాని ముందు భక్తులు వాద్యాలు మీటుతూ పాటలు పాడారు. జంతుబలులు సమర్పించారు. దావీదు యాజకులు ధరించే నారబట్టలు తాల్చి మందసం ముందు తన్మయత్వంతో నాట్యం చేశాడు. పెట్టెను నగరంలోని గుడారంలో ప్రతిష్ఠించారు. రాజు అక్కడ దహనబలులు సమాధాన బలులు సమర్పించాడు. అందరికీ రొట్టెలూ పండ్లూ పంచిపెట్టాడు. సౌలు కూతురు మీకాలు దావీదు భార్య. ఆమె నీవు కోణంగిలాగ మందసం ముందు నాట్యం జేశావు గదా అని దావీదుని దెప్పిపొడిచింది. అతడు ప్రభువు నీ తండ్రిని కాదని నన్ను ప్రజలకు రాజుని జేశాడుగదా అని ఆమెకు సమాధానం చెప్పాడు. ఆ రాజు యావేపట్ల అపారమైన భక్తి కలవాడు. ఆ ప్రభువుని స్తుతిస్తూ చాల కీర్తనలు కూడ వ్రాశాడు.

## 57. బత్షెబా ఉదంతం – *2సమూ 11*

దావీదు సైన్యాధిపతి యోవాబు రబ్బా పట్టణంలో అమ్మోనీయులతో యుద్ధం జేస్తున్నాడు. ఒకరోజు మాపటివేళ దావీదు రాజభవనం మీద పచార్లు చేస్తూ ప్రక్కింటి ఆడగూతురు బత్షెబా స్నానం చేసికొంటూండగా గమనించాడు. ఆమె కంట బడగానే దావీదుకి మతి చలించింది. ఆమె దావీదు సైనికుల్లో ఒకడైన ఊరియా భార్య. అతడు రబ్బా నగరంలో యుద్ధం జేస్తున్నాడు. దావీదు సేవకులను పంపి బత్షెబను తన మేడకు రప్పించుకొని ఆమెను కూడాడు. ఆమె గర్భవతి ఐంది. బత్షెబ పెనిమిటి వల్లనే

గర్భందాల్చినట్లు ప్రచారం చేయగోరి దావీదు యుద్ధం నుండి ఊరియాను పిలిపించాడు. కాని దావీదు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఊరియా ఇంటికిపోక రాజభవనంలోనే రాజు అంగరక్షకులతో కలసి నిద్రించాడు. అతడు యుద్ధంలో యోవాబు, సైనికులు పోరాడుతూ గుడారాల్లోనే నిద్రిస్తున్నారు. ఈలాంటి సమయంలో నేను ఇంటికిపోయి తిని త్రాగి ఆలిని కూడ్డం ధర్మం కాదు అన్నాడు. కనుక దావీదు పన్నాగం ఫలించలేదు. అతడు మరో పన్నుగడ పన్నాడు. పోరు ముమ్మరంగా జరిగే చోట ఊరియాను మొదటి వారుసలో వుంచండి. శత్రువులు వచ్చి మీద పడినప్పుడు మీరు కొంచం వెనుకకు తగ్గండి. దెబ్బలు తిని అతడే చస్తాడు అని యోవాబుకి జాబు వ్రాసి దాన్ని ఊరియా చేతనే పంపించాడు. రాజుకోరినట్లే ఊరియా పోరులో చనిపోయాడు. దావీదు బత్షెబాను పెండ్లిచేసికొన్నాడు. వారికి బిడ్డడు పుట్టాడు.

### 58. నాతాను ప్రవక్త దావీదును మందలించడం -2సమూ *12*

దావీదు చేసిన మోసం యావేకు కోపం రప్పించింది. ప్రభువు నాతాను ప్రవక్తను పంపగా అతడు వచ్చి దావీదుకి ఓ కథ చెప్పాడు. ఓ నగరంలో ఓ ధనవంతుడూ పేదవాడూ వున్నారు. ధనవంతునికి గొర్రెల మందలూ గొడ్ల మందలూ వున్నాయి. పేదవాడికి ఓ గొర్రె పిల్ల మాత్రమే వుంది. అతడు దాన్ని అల్లారుముద్దుగా పెంచుకొంటున్నాడు. ఓ దినం సంపన్నుని యింటికి చుట్టం వచ్చాడు. అతనికి విందు చేయడానికి ధనవంతుడు తన గొర్రెను చంపక బలవంతంగా పేదవాని గొర్రెపిల్లను గైకొని భోజనం తయారుచేయించాడు చూచావా అని చెప్పాడు. దావీదు ఆ కథ విని ఉగ్రుడై ఈ యన్యాయానికి పాల్పడినవాడు ద్రోహి. అతడు నాల్గు వంతులు నష్టపరిహారం చెల్లించి తీరాలి అన్నాడు. నాతాను వెంటనే అందుకొని ఆ ద్రోహివి నీవే సుమా! యావే పలుకులు ఆలించు. నీకు ఇందరు భార్యలుండగా నీవు ఓ పేదవాని భార్యను అపహరించావు. పైగా ఆ పేదవాణ్ణి మోసంతో కత్తితో చంపించావు. దీనికి ప్రతీకారంగా నీ

కుటుంబంలోనే హత్యలు జరుగుతాయి. నీ భార్యలను మరొకడు చెరుస్తాడు అని చెప్పాడు. ఈలా నాతాను ప్రభువు పలుకులను విన్పింపగా దావీదు పశ్చాత్తాప పడ్డాడు. నేను యావేకు ద్రోహంగా పాపంచేశాను అని వొప్పుకొన్నాడు. ప్రవక్త దేవుడు నిన్ను క్షమిస్తాడు అని చెప్పాడు.

దావీదు పాపానికి శిక్షగా బత్షెబకు పుట్టిన బిడ్డడు చనిపోయాడు. రాజు వాడికొరకు శోకించాడు. బత్షెబ మరల గర్భవతియై ఇంకో బిడ్డణ్ణి కంది. అతడే సొలోమోను రాజు. ప్రవక్త అతనికి యెదీద్యా అని పేరుపెట్టాడు. యావేకు ఇష్టుడు అని ఆ పేరుకి అర్థం.

## 59. ఇత్తయి స్వామి భక్తి - *2సమూ 15,16-22*

అబ్సాలోము దావీదు కుమారుల్లో వొకడు. అతడు తండ్రి మీద తిరగబడి రాజ్యాన్ని ఆక్రమించుకోజూచాడు. దావీదు అతనికి దడిసి పట్టణం నుండి పారిపోతున్నాడు. అన్యజాతి వాడైన ఇత్తయి దావీదు సేవకుల్లో వొకడు. అతడు కూడ రాజుతోపాటు ప్రవాసానికి వెళ్లడానికి సిద్ధమయ్యాడు. దావీదు ఓయి! నీవు ఇటీవలే నా కొలువులో చేరావు. ఇప్పుడు నాతో వచ్చి ప్రవాసంలో బాధలు అనుభవించడం దేనికి? క్రొత్తరాజు కొలువులోచేరి సుఖంగా జీవించు. వెనుదిరిగిపో అని చెప్పాడు. కాని యిత్తయి నేను నీతోనే వస్తాను. చావుగాని బ్రతకు కాని రాజెక్కడ వుంటాడో ఈ దాసుడు కూడ అక్కడే వుంటాడు అని పల్కాడు. ఇత్తయి స్వామి భక్తికి మెచ్చుకొని దావీదు అతన్ని వెంట తీసికొనిపోయాడు.

## 60. దావీదు ఔదార్యం - *2సమూ 9*

దావీదు సౌలు కుటుంబంలో ఇంకా యెవరు మిగిలివున్నారని విచారించగా యోనాతాను కుమారుడు మెఫీబోషెతు మిగిలివున్నాడని తెలిసింది. అతని రెండు కాళ్లూ కుంటివి కనుక సరిగా నడవలేడు. దావీదు సౌలు కుటుంబాన్ని ఆదరంతో చూస్తానని యోనాతానుకి మాట యిచ్చాడు. కనుక మెఫీబోషెతుని పిలిపించి ఇకమీదట నీవు రాజభవనంలో నా సరసన కూర్చుండి భోజనం చేయి అని చెప్పాడు. ఆ అవిటివాడు అయ్యా! నేను ఏ

పాటివాణ్ణి? చచ్చిన కుక్క లాంటి వాణ్ణికదా! నీవు ఈ దాసుని పట్ల ఎంత దయజూపావు అని దావీదుకి దండం పెట్టాడు. రాజు సీబా అనే సేవకుణ్ణి సౌలు పొలం సాగుజేసి ధాన్యాన్ని మెపీబోషెతు కుటుంబానికి ఈయ వలసిందగా ఆజ్ఞాపించాడు. ఆ అవిటివాడు మాత్రం జీవితాంతం రాజ భవనంలోనే భోజనంచేశాడు.

## 61. అబ్షాలోము చావు -2సమూ *18,9-17*

అబ్షాలోము తండ్రిమీద తిరగబడి విప్లవం లేవదీశాడు. అతని సైన్యానికీ దావీదు సైన్యానికీ అడవిలో యుద్ధం జరిగింది. అతని సైన్యం ఓడిపోయింది. అబ్షాలోముకి పెద్ద జుట్టు వుంది. అతడు గాడిదనెక్కి సిందూరపు చెట్టు క్రిందిగా పోతుండగా జుట్టు గజిబిజిగా ఎదిగివున్న ఆ చెట్టు కొమ్మల్లో చిక్కుకొంది. గాడిద అతన్ని విడిచి వెళ్లిపోయింది. అతడు చెట్టుకొమ్మల్లో వేలాడుతున్నాడు. యోవాబుకి ఈ సంగతి తెలిసింది. అతడు వెంటనే పోయి బల్లెం తీసికొని అబ్షాలోము గుండెలో పొడిచాడు. అతని అంగరక్షకుడు శత్రువు మీదపడి అతన్ని చంపివేశాడు. కుమారుడు చనిపోయినందుకు రాజు మిగుల దుఃఖించాడు. నాయనా! నీకు బదులుగా నేనే చనిపోయినట్లయితే బాగుండేది కదా అని యేడ్చాడు. యోవాబు అతన్ని ఓదార్చాడు. తర్వాత దావీదు మరల రాజుగా పరిపాలనం చేశాడు.

## 62. సొలోమోను కల - *1*రాజు *3*

దావీదు తర్వాత సొలోమోను రాజయ్యాడు. అతడు మొదట దావీదు మార్గాల్లోనే నడచి యావే ప్రభువుని భక్తితో సేవించాడు. ఒకసారి గిబ్యోను పుణ్యక్షేత్రానికి వెళ్లి దేవునికి బలి సమర్పించాడు. ఆ రాత్రి దేవుడు కలలో కన్పించి నీకు ఏమి వరం కావాలో కోరుకోమన్నాడు. సొలోమోను ప్రభూ! నేను చిన్నవాడను. మా తండ్రి కున్న అనుభవం నాకు లేదు. ఇప్పుడు నీ దయ వల్ల నేను రాజునయ్యాను. కనుక ఈ ప్రజలను పాలించడానికి కావలసిన వివేకాన్ని నాకు ప్రసాదించు అని వేడుకొన్నాడు. దేవుడు రాజుని మెచ్చుకొని నీవు దీర్ఘాయువు, సిరిసంపదలు, శత్రునాశం మొదలైన వరాలు కోరుకోలేదు. ప్రజల మేలెంచి వారిని న్యాయసమ్మతంగా పరిపాలించడానికి

వివేక వరాన్ని అడిగావు. నీ కోర్కెను తప్పక తీరుస్తాను. ఏ రాజుకీ దక్కని సిరిసంపదలూ, కీర్తి ప్రతిష్ఠలూ నీ కిస్తాను. నీ తండ్రిలాగే నీవుకూడ నాయాజ్ఞలు పాటించావంటే నీకు దీర్ఘాయువు కూడ లభిస్తుంది అని చెప్పాడు. తర్వాత సొలోమోను యెరూషలేములో కూడ బలి సమర్పించి తన కొలువు వారికి విందు చేశాడు.

## 63. సొలోమోను స్త్రీల తగవు తీర్చడం –*1రాజు 3*

దేవుడిచ్చిన వివేకవరం సొలోమోను మీద పనిచేసింది. ఒకే యింటిలో వసిస్తున్న యిద్దరు వేశ్యలు ఒకే పర్యాయం మగబిడ్డలను కన్నారు. వారిలో ఒక బిడ్డడు చనిపోయాడు. చనిపోయిన బిడ్డడి తల్లి తన శిశువుని తెచ్చి రెండవ తల్లి ప్రక్కలో పండబెట్టి బ్రతికివున్న శిశువుని కొనిపోయి తన ప్రక్కలో పండబెట్టుకొంది. తర్వాత నిజమైన తల్లి ఆ మోసాన్ని గుర్తించింది. వాళ్లిద్దరూ బ్రతికివున్నవాడు నా బిడ్డడంటే నా బిడ్డడని తగాదా ఆడుకొని రాజు దగ్గరికి వచ్చి తీర్పు తీర్చమన్నారు. సొలోమోను కొంచెం ఆలోచించి బంటును పిలచి శిశువుని రెండు ముక్కలుగా నరికి చెరొక ముక్క ఈయమన్నాడు. నిజమైన తల్లి దేవరా! నా బిడ్డడు ఎక్కడ బ్రతికి వున్నా చాలు. వాణ్ణి చంపవద్దు. ఆమెకే యిప్పించండి అంది. రెండవ ఆమె అసూయతో ఈ పాపడు ఎవరికీ దక్కకూడదు. వీణ్ణి రెండుగా నరక వలసిందే అంది. రాజు నిజమైన తల్లి మొదటి ఆమె అని తీర్పు చెప్పాడు. నగరంలోని ప్రజలు రాజు చెప్పిన తీర్పు విన్నారు. వాళ్లు సొలోమోనుకి అతని తండ్రికున్నంత అనుభవం వుందా అని శంకిస్తున్నారు. ఈ తీర్పును విన్నతర్వాత రాజుని మెచ్చుకొని అతనికి విధేయులయ్యారు.

## 64. దేవాలయ నిర్మాణం - *1రాజు 5*

సొలోమోను సాధించిన గొప్ప కార్యం యెరూషలేము దేవాలయ నిర్మాణం. మొదట దావీదే దేవళాన్ని కట్టాలని సంకల్పించుకొన్నాడు. స్థలాన్ని కొని వెండిబంగారాలు ప్రోగుజేశాడు. కాని దేవుడు నీ కుమారుడు ఆ పని చేస్తాడు అని చెప్పగా ఆగిపోయాడు. సొలోమోను తూరు రాజైన

హిరాముతో పొత్తు కుదుర్చుకొన్నాడు. ఆ రాజు దేవదారులు, సరళ వృక్షాలు నరకించి సొలోమోనుకి పంపాడు. సొలోమోను పనివాళ్లు రాళ్లు పగలగొట్టారు. ఇంచుమించు రెండు లక్షలమంది పనివాళ్లు ఏడేండ్లు శ్రమించి మందిరాన్ని కట్టి ముగించారు. సొలోమోను తన పరిపాలనా కాలం నాల్గవయేట మందిర నిర్మాణం ప్రారంభించి, పదకొండవ యేట ముగించాడు. దేవాలయం తర్వాత రాజప్రాసాదం కూడ నిర్మించాడు. ఆ రోజుల్లో సొలోమోను దేవాలయం అద్భుతమైన కట్టడం. దేశదేశాల నుండి యాత్రికులు దాన్ని సందర్శించడానికి వచ్చేవాళ్లు.

దేవాలయ నిర్మాణం ముగిసాక రాజు మందసాన్ని తెప్పించి దేవాలయంలో ప్రతిష్ఠింప జేశాడు. దైవసాన్నిధ్యం దేవళంలో నెలకొంది. ప్రజలు పెద్ద గుంపుగా ప్రోగయ్యారు. రాజు పీఠానికి ఎదురుగా నిల్చుండి చేతులు పైకెత్తి యిస్రాయేలు ప్రభువువైన దేవా! పై ఆకాశంలో గాని క్రింది పాతాళంలోగాని నీలాంటి దేవుడు లేడు. నీవు మమ్ము కరుణించు అని ప్రార్థించాడు -8,23.

## 65. షెబారాణి రాజును సందర్శించడం - *1రాజు10*

షెబారాణి సొలోమోను గొప్పతనాన్ని గూర్చి విని అతన్ని సందర్శించడానికి ఆఫ్రికా దేశంనుండి వచ్చింది. ఆమె యెన్నో చిక్కుప్రశ్నలు వేయగా అతడు అన్నిటికి జవాబు చెప్పాడు. రాణి అతడు నిర్మించిన భవనాలనూ, అతని సేవకులనూ, అతని జ్ఞానాన్నీ చూచి విస్తుపోయింది. నేను నిన్ను గూర్చి వినిన దానికంటె నీవు అధికుడవు అని మెచ్చుకొంది. అతనికి బంగారం రత్నాలు, సుగంధ ద్రవ్యాలు కానుకకగా యిచ్చింది. రాజుకూడ ఆమెకు నానా వస్తువులు బహూకరించాడు.

## 66. సొలోమోను విగ్రహారాధనం - *1రాజు 11*

ప్రభువు సొలోమోనుకి సంపదలూ, అధికారం, విజ్ఞానం అన్నీ యిచ్చాడు. ఐనా ఆరాజు పడిపోయాడు. ఆ రాజు తన అధికారాన్ని కాపాడుకోడానికి చాలమంది అన్యజాతి రాజపుత్రికలను పెండ్లాడాడు. వాళ్లు అన్యదైవాలను కొల్చే స్త్రీలు. కనుక వాళ్లు సొలోమోను హృదయాన్ని

కూడ తమ దైవాలవైపు త్రిప్పారు. యిస్రాయేలీయులు అన్యజాతి వారిని పెండ్లాడరాదని ప్రభువు ముందుగానే ఆజ్ఞాపించాడు. సొలోమోనుకి ఏడువందలమంది భార్యలూ, మూడువందలమంది ఉపపత్నులూ వున్నారు. అతడు ఈ రాణులకు దేవాలయాలు కట్టించి వారి దైవాలకు పూజలు చేశాడు. తన తండ్రియైన దావీదు వలె యావే ప్రభువును పూర్ణ హృదయంతో సేవించలేదు. ప్రభువు రెండుసార్లు రాజుకు ప్రత్యక్షమై విగ్రహారాధనం మానుకొమ్మన్నా మానలేదు. కనుక ప్రభువు అతనిపై కోపించి నీ రాజ్యంలో పదివంతులు నీ సేవకునికి ఇచ్చివేస్తాను. ఒక్క వంతు మాత్రం నీ కుమారుని అధీనంలో వుంటుంది అని చెప్పాడు. దేవుడు చెప్పినట్లే తర్వాత సొలోమోను రాజ్యం రెండుగా చీలిపోయింది.

## 67. సొలోమోను మరణం, రాజ్య విభజనం - *1రాజు 11-12*

సొలోమోను పోకడలు ఆనాటి పెద్దలకు నచ్చలేదు. వారిలో అహీయా ప్రవక్త వొకడు. యరోబాము సొలోమోను రాజ్యంలో వెట్టిచాకిరి చేసేవాళ్లకు పెద్ద. సమర్థుడైన పనివాడు. ఒకమారు అహీయా ప్రవక్త యరోబామును త్రోవలో కలసికొని తన క్రొత్త అంగీని దిడీలున పండ్రెండుముక్కలుగా చించాడు. యరోబాముతో నీవు వీటిలో పదిముక్కలు తీసికో. సొలోమోను అన్యదైవాలను కొల్చి దేవుని ఆజ్ఞ మీరాడు. అతని రాజ్యంలో పదివంతులకు నీవు రాజువౌతావు. ఒక్కవంతు మాత్రం సొలోమోను కుమారుని వశంలో వుంటుంది. ఈ కార్యం ఆ కుమారుని కాలంలో జరుగుతుంది అని చెప్పాడు. సొలోమోనుకి ఈ సంగతి తెలిసింది. అతడు యరోబాముని చంపజూచాడు గాని అతడు ఈజిప్టుకి పారిపోయాడు.

సొలోమోను నలభైయేండ్లు పరిపాలించి చనిపోయాడు. అతని కుమారుడు రెహబాము రాజయ్యాడు. ప్రజల పెద్దలు అతన్ని సమీపించి నీ తండ్రి మాపై విధించిన పన్నులు తగ్గించమని వేడుకొన్నారు. కాని అతడు యువకుల సలహాలు పాటించి మా తండ్రి విధించిన పన్నులను తగ్గించను గదా, యింకా పెంచుతాను అని పరుషంగా మాటలాడాడు.

దానితో ప్రజలు రెచ్చిపోయి రాజుమీద తిరగబడ్డారు. యిస్రాయేలు ప్రజలు పండ్రెండు తెగలు. వారిలో పదితెగలవాళ్లు చీలిపోయి యరోబామును రాజుగా ఎన్నుకొన్నారు. అదే ఉత్తర రాష్ట్రం. యూదా, బెన్యామీను అనే రెండు తెగలు మాత్రం రెహబాముతో వుండి పోయాయి. అదే దక్షిణరాష్ట్రం ఈ విధంగా అహీయా ప్రవచనం నెరవేరింది.

### 68. ఏలీయా ప్రవక్తకు భోజనం - *1రాజు 17,1-6*

యిస్రాయేలు దేశంలో అహాబు రాజు, అతని భార్య యెసెబెలు బాలు దేవతను పూజిస్తున్నారు. ఏలీయా ప్రవక్త యావే ప్రభువును కొల్చేవాడు. కనుక ప్రవక్త రాజుమీద కోపించి దేశంలో మూడేండ్ల పాటు కరువు వొచ్చేలా చేశాడు. రాజు ప్రవక్తపై ఆగ్రహించాడు. దేవుని ఆజ్ఞపై ప్రవక్త వెళ్లి కెరీతు వాగులో దాగుకొన్నాడు. ప్రభువు కాకులను పంపగా అవి రేపు మాపు ప్రవక్తకు భోజనం కొనివచ్చేవి. భక్తుడు ఆ భోజనం తిని వాగులో నీళ్లు త్రాగి ప్రాణాలు నిలుపుకొన్నాడు.

### 69. సారెఫతు విధవ - *1రాజు 17,8-24*

దేవుని ఆనతిపై ఏలీయా సారెఫతు నగరానికి వెళ్లాడు. అక్కడ గూడ కరువు వుంది. ఆ వూరిలో ఓ విధవ చివరి రొట్టె కాల్చుకొని తినబోతూంది. ఇక ఆమె యింటిలో పిండిగాని, నూనెగాని మిగలవు. కాని యేలీయా కోరికపై ఆమె మొదట అతనికి రొట్టె చేసిపెట్టింది. అతడు దీవింపగా ఆమె కుండలోని పిండి, పిడతలోని నూనె తరిగిపోకుండా ఆలాగే వుండిపోయాయి. కనుక ప్రవక్త విధవ, ఆమె కుమారుడు రోజూ రొట్టె భుజిస్తూ వచ్చారు. ఈలా వుండగా ఒకనాడు పిల్లవాడు జబ్బుచేసి చనిపోయాడు. ఏలీయా అతన్ని మీది గదిలోకి తీసికొనిపోయి దేవునికి మనవిచేసి అతనిమీద బోరగిల పండుకొన్నాడు. అతని వూపిరి బాలుని లోనికి ప్రవేశింపగా వాడు మళ్లా బ్రతికాడు. తల్లి యెంతో సంతోషించింది.

### 70. కర్మెలు కొండమీద బలి - *1రాజు 18,20-40*

ఏలీయా అహాబు రాజుని సవాలు చేశాడు. రాజు 450 మంది

బాలు ప్రవక్తలను కర్మెలు కొండమీద ప్రోగు జేశాడు. ప్రవక్త కూడ ప్రజలతో వచ్చాడు. రెండెద్దులను చంపి వాటి మాంసాన్ని బలిపీఠాలమీద పేర్చాలి. నిప్పు అంటించకూడదు. రెండు పక్షాల వాళ్లు వాళ్ల దేవుళ్లకు ప్రార్థన చేయాలి. ఏ దేవుడు నిప్పు పంపి మాంసాన్ని కాల్చి వేస్తాడో అతడే నిజమైన దేవుడు. ఇదీ పందెం. మొదట బాలు ప్రవక్తలు మధ్యాహ్నం దాకా వారి దేవునికి ప్రార్థన చేశారు. మంత్రాలు వల్లించి నెత్తురు కారిందాకా తమ శరీరాలను కత్తులతో కోసుకున్నారు. ఐనా బాలు దేవత పలకలేదు. తర్వాత ఏలియా బలి పీఠాన్ని నిర్మించి దానిమీద ఎద్దు మాంసాన్ని పేర్చాడు. పీఠం మీద నీళ్లు పోసాడు. సాయంకాలం పూట దేవునికి ప్రార్థన చేయగా వెంటనే నిప్పు దిగిచ్చి మాంసాన్నీ తడిసిన పీఠాన్నీ గూడ దహించి వేసింది. ప్రజలు యావే ప్రభువు ఒక్కడే దేవుడని కేకలు వేసారు. ఏలీయా ఓడిపోయిన బాలు ప్రవక్తలు 450 మందిని కీషోను వాగు దగ్గర చంపించాడు. ఈ పందెం ముగియగానే మూడేండ్ల కరువు ఆగిపోయి పెద్దావాన కురిసింది. ఇది యేలీయా చేసిన అద్భుతాలన్నిటిలోను గొప్పది.

తర్వాత యెసెబెలు రాణి ఏలీయాను చంపిస్తానని బెదిరించింది. ప్రవక్త భయపడి హోరేబు కొండకు పారిపోయాడు. అక్కడ దేవుడు ప్రత్యక్షమై అతనికి దైవసేవలో ధైర్యాన్ని బలాన్నీ ప్రసాదించాడు.

## 71. ఎలీషాకు పిలుపు - *1రాజు 19,19-21*

ఎలీషా పండ్రెండు అరకలతో దుక్కిదున్నుతున్నాడు. తాను చివరి అరకను తోలుతున్నాడు. ప్రవక్త తన అంగీని తీసి అతనికి కప్పాడు. దానితో అద్భుతాలు చేసే యేలీయా శక్తి ఎలీషాకు సంక్రమించింది. అతడు ఎద్దులను చంపి మాంసం వండి తోడి పనివారికి భోజనం పెట్టాడు. ఆ పిమ్మట సేద్యం మానివేసి ఏలీయాకు శిష్యుడై అతన్ని అనుసరించాడు. యిస్రాయేలు దేశంలో యావే మతాన్ని నిలబెట్టే బాధ్యతను ఏలీయా తర్వాత ఏలీషా స్వీకరిస్తాడు.

## 72. నాబోతు ద్రాక్షతోట - *1రాజు 21*

యెస్రెయేలు నగరంలో అహాబు మేడ ప్రక్కనే నాబోతు అనే రైతుకి

ఓ ద్రాక్ష తోట వుంది. రాజు కూరగాయలు పండించుకోవడానికి ఆ తోటను తనకమ్మమని రైతుని అడిగాడు. నాబోతు ఈ భూమి వంశపారంపర్యంగా మా కుటుంబానికి చెందాలి. కనుక నేను దీన్ని అమ్మలేను అని చెప్పాడు. అహాబు నిరుత్సాహపడ్డాడు. కాని యెసెబెలు రాజు వ్రాసినట్లుగానే జాబు వ్రాసి, రాజముద్ర వేసి ఊరిపెద్దలకు పంపింది. దానిలో నాబోతు మీద దొంగనేరం మోపి అతన్ని రాళ్లతో కొట్టి చంపించమని ఆదేశించింది. ఊరి పెద్దలు అది అహాబు వ్రాసిన జాబే ననుకొని నాబోతుని అన్యాయంగా చంపించారు. ఇదే అదుననుకొని అహాబు రైతు పొలాన్ని స్వాధీనం చేసికోబోయాడు. కాని దేవుడు ఏలీయా ప్రవక్తను పంపగా అతడు వచ్చి ధైర్యంగా రాజుని ఎదిరించి చీవాట్లు పెట్టాడు. నీవు ఒక పేద రైతుని చంపించి అతని పొలాన్ని గూడ దొంగిలించబోతున్నావు. దీనికి శిక్షగా నాబోతు నెత్తురు కుక్కలు నాకిన తావుననే నీ నెత్తురు కూడ శునకాలు నాకుతాయి అని శపించాడు. యెసబెలు శవాన్ని కుక్కలు పీకుకొని తింటాయి అని పల్కాడు. తర్వాత అతని శాపవాక్యాలు అక్షరాల నెరవేరాయి.

## 73. ఏలీయా స్వర్గానికి వెళ్లిపోవడం - *2రాజు 2,1-18*

ఏలీయా స్వర్గానికి వెళ్లిపోయే సమయం దగ్గరించింది. అతడూ ఏలీషా గిల్గాలు నుండి యోర్దాను నది చెంతకు వచ్చారు. దారిలో తోడిప్రవక్తలు వారిని కలసికొని ఈరోజు ఏలీయా స్వర్గానిక వెళ్లిపోతాడు అని గుసగుసలాడుకొన్నారు. ఏలీయా తన అంగీని తీసి నది నీళ్లను కొట్టగా అవి రెండుగా విడిపోయి దారి యేర్పడింది. గురుశిష్యులు ఆవలివొడ్డు చేరుకొన్నారు. ఏలీయా శిష్యునితో ప్రభువు నన్ను తీసికొని పోకముందే నేను నీకు ఏమి వుపకారం చేయాలో కోరుకో అన్నాడు. ఏలీయా నాకు నీ శక్తిలో రెండు వంతులు దయచేయి అని అడిగాడు. శిష్యుడు గురువుకి అనుయాయియై అతని ఉద్యమాన్ని కొనసాగించాలి కదా! ఏలీయా నీ వడిగింది కష్టమైన వరం. ప్రభువు నన్ను కొని పోయేటప్పుడు నేను నీకు కన్పిస్తే నీ కోర్కె నెరవేరుతుంది అని చెప్పాడు. వెంటనే నిప్పు గుర్రాలు లాగే అగ్నిరథం వారి మధ్యకు వచ్చింది. ఏలీషా

దానినెక్కి సుడిగాలిలో స్వర్గానికి వెళ్లిపోయాడు. ఏలీషా అదృశ్యాన్ని చూచాడు. గురువు వెళ్లిపోయినందుకు ఎంతో చింతించాడు. అతడు ఏలీయా జారవిడచిన అంగీతో నదినీళ్లను బాదగా అవి విడిపోయి దారి యేర్పడింది. ఆ దారిన ఈవలి వొడ్డుకి నడచివచ్చాడు. ఈ యద్భుతం ద్వారా ఏలీయా శక్తి అతనికి సంక్రమించిందని రుజువైంది.

## 74. అల్లరి పిల్లలకు శిక్ష - *2రాజు 2,23-25*

ఎలీషా బేతేలుకు వెళ్తుండగా దారిలో కొందరు అల్లరిపిల్లలు ప్రోగై అతని వెంటబడి పోపో బట్ట తలకాయా అని ఎగతాళి చేశారు. అతడు కోపంతో వారిని శపించాడు. వెంటనే అడవిలోనుండి రెండు ఎలుగుబంట్లు వచ్చి నలభై యిద్దరు పిల్లలను చంపివేశాయి. పెద్దలను అవమానించ కూడదని ఈ సంఘటనం భావం.

## 75. ఎలీషా పేద విధవకు సహాయం చేయడం - 2రాజు 4,1-7

ఒక ప్రవక్త బాకీ చేసి చనిపోయాడు. ఋణదాతవచ్చి అతని యిద్దరు కుమారులను బానిసలుగా తీసికొని పోతానని బెదిరించాడు. విధవయైన తల్లి వచ్చి యేలీషా వద్ద మొరపెట్టుకొంది. ఆమె యింటిలో కూజాలో ఓలివు నూనెమాత్రం వుంది. ప్రవక్త ఆమెతో మీ యిరుగు పొరుగు వారి యిండ్లనుండి ఖాళీ కూజాలు ప్రోగు జేసికొని వచ్చి మీ కూజాలోని ఓలీవు నూనెను వాటిలో పోయమని చెప్పాడు. ఆమె ప్రవక్త మాటలు విశ్వసించి అతడు చెప్పినట్లే చేసింది. చమురు పోస్తుండగా ఆ కూజాలన్నీ నిండిపోయాయి. చివరి కూజా నిండాక సొంత కూజాలోని చమురు పొర్లడం ఆగిపోయింది. ప్రవక్త సలహాపై ఆమె ఆ చమురు అమ్మి బాకీ తీర్చింది. మిగిలిన సొమ్ముతో తానూ యిద్దరు కుమారులూ జీవిత యాత్ర గడిపారు.

## 76. విషమెక్కిన పులుసు - 2రాజు 4,38-41

ఎలీషా గిల్గాలులో ప్రవక్తలకు బోధ చేస్తున్నాడు. సేవకుణ్ణి పిల్చి ప్రవక్తలకు పులుసు తయారు చేయమని చెప్పాడు. ఒక ప్రవక్త పొలానికి పోయి తెలియక ఏవో పిచ్చి కాయలు కోసుకుని వచ్చి ముక్కలుగా తరిగి

ఉడికే పులుసులో కలిపాడు. తర్వాత ప్రవక్తలు పులుసును త్రాగబోగా దానికి విషమెక్కింది. ఏలీషా కొంచెం పిండిని తెప్పించి పులుసులో కలిపాడు. వెంటనే విషం విరిగిపోగా అతిథులు పులుసు త్రాగారు. అది వారికి ఏ హాని చేయలేదు.

## 77. రొట్టెలు పెరగడం - 2రాజు 4,42-44

ఒక భక్తుడు ఏలీషాకు ఇరవై యవధాన్యపు రొట్టెలూ, ధాన్యం వెన్నులూ తీసికొని వచ్చాడు. ప్రవక్త సేవకుణ్ణి పిల్చి వాటిని మన యింటికి వచ్చిన ప్రవక్తలకు పంచి పెట్టమని చెప్పాడు. కాని వాళ్లు వందమంది వున్నారు. కనుక సేవకుడు ఇంతమందికి యివి ఏలా సరిపోతాయి అని అడిగాడు. ఏలీషా పర్వాలేదు. అతిథులు తిన్నాక ఇంకా కొన్ని మిగులుతాయి అని చెప్పాడు. శిష్యుడు రొట్టెలను పంచగా అందరూ తృప్తిగా భుజించారు. పిమ్మట ఇంకా కొన్ని మిగిలాయి. ప్రవక్త వాక్కులోని శక్తి ఆలాంటిది.

## 78. షూనేము స్త్రీ కుమారుణ్ణి బ్రతికించడం - *2రాజు 4,8-37*

ఎలీషా షూనేము నగరానికి వెళ్లాడు. అక్కడ ఓ సంపన్నురాలు అతనికి ఆతిథ్యమిచ్చింది. ఆమె యింటిమీద ఓ గది కట్టించి దానిలో పడక కుర్చీ బల్ల, దీపం మొదలైన సామానులు అమర్చింది. ఎలీషా ఆ వూరు వెళ్లినప్పుడెల్ల ఆ గదిలోనే బస చేసేవాడు. ఆమెకు సంతానం లేదు. తనకు చేసిన ఉపకారానికి బదులుగా, ప్రవక్త ఆమెకు ఒక యేడాదిలోనే సంతానం కలుగుతుందని దీవించాడు. తర్వాత అతడు చెప్పినట్లే బిడ్డడు పుట్టాడు. కాని ఒకనాడు ఆ పిల్లవాడు జబ్బుచేసి చనిపోయాడు. తల్లి వాణ్ణి యేలీషా గదిలోని పడక మీద పరుండబెట్టి గబగబా కర్మెలు కొండమీద వసించే యేలీషా దగ్గరికి వెళ్లింది. నీవు నా కుమారుణ్ణి బ్రతికించాలని వేడుకొంది. ప్రవక్త మొదట తన శిష్యుడు గేహసీని పంపగా అతడు గురువుగారి కర్రను కొనిపోయి బాలుని మృతదేహంపై చాపాడు. ఐనా బిడ్డడికి ప్రాణం రాలేదు. తర్వాత ఎలీషా

వచ్చి మీది గదిలోనికి పోయి బాలుని మృతదేహంపై బోరగిల పండుకొన్నాడు. అతని నోరు, కన్నులు, చేతులు శవాన్ని తాకాయి. పిల్లవాడి శరీరానికి ఉష్ణం పుట్టింది. వాడు ఏడుసార్లు తుమ్మి మెల్లగా కన్నులు విప్పి చూచాడు. ప్రాణాలు తిరిగి వచ్చిన బిడ్డణ్ణి ప్రవక్త తల్లికి అప్పగించాడు.

## 79. నామాను కుష్ఠ నయంగావడం - *2రాజు 5,1-19*

నామాను సిరియా దేశానికి సైన్యాధిపతి. అతడు ఆ దేశపు రాజుకి చాల విజయాలు చేకూర్చి పెట్టాడు. కనుక రాజుకి అతనిమీద అభిమానం కలిగింది. కాని నామాను కుష్ఠరోగి. ఒకసారి సిరియనులు యిస్రాయేలు దేశంమీద దండెత్తి వారి బాలికను బందీగా కొనివచ్చి నామాను భార్యకు దాసిగా యిచ్చారు. ఆ పిల్ల మన దొర యిస్రాయేలు దేశానికి వెళ్తే అక్కడి ప్రవక్త కుష్ఠ నయం చేస్తాడని యజమానురాలితో చెప్పింది. ఆ సంగతి నామాను రాజుకి తెలియజేయగా అతడు సైన్యాధిపతిని సిఫార్సు చేస్తూ యిస్రాయేలు రాజుకి జాబు వ్రాసి యిచ్చాడు. నామాను ఆ లేఖతో, కానుకలతో యిస్రాయేలు రాజు వద్దకు వచ్చాడు. రాజు ఆ జాబు చదివి ఇతని కుష్ఠ నేనేలా నయం జేయగలనని చిరాకు తెచ్చుకొన్నాడు. ఆ సంగతి విని ఎలీషా సైన్యాధిపతిని తన దగ్గరికి పంప మన్నాడు. కాని అతడు వచ్చినప్పుడు ఎలీషా ఎదురు వచ్చి అతన్ని ఆహ్వానించలేదు. సేవకుణ్ణి పంపించి నీవు వెళ్లి ఏడుసార్లు యోర్దాను నదిలో స్నానం చేయి అని చెప్పించాడు. నామాను అది అమార్యదగా భావించి కోపించి తన దేశానికి తిరిగి పోగోరాడు. కాని సేవకులు అతన్ని బతిమాలి యోర్దానులో స్నానం చేయించారు. వెంటనే కుష్ఠ నయమై ఆరోగ్యం చేకూరింది. నామాను తిరిగి వచ్చి కృతజ్ఞతా పూర్వకంగా కానుకలు అర్పించ బోయాడు గాని ప్రవక్త వాటిని స్వీకరించలేదు. సైన్యాధిపతి ఇక మీదట నేను యావే ప్రభువుని మాత్రమే ఆరాధిస్తానని మాట యిచ్చి తన దేశానికి పయనమయ్యాడు.

## 80. గేహసీ దురాశ - *2 రాజు 5,20-27*

గేహసి యెలీషా శిష్యుడు. ప్రవక్తగా తర్ఫీదు పొందుతున్నాడు. అతడు

గురువు నామాను కానుకలను తిరస్కరించడం చూచాడు. దురాశతో తాను వాటిని దక్కించుకోవాలనుకొన్నాడు. నామాను వెంట పరుగెత్తి అయ్యా! మా గురువుగారి దగ్గరకి ఇప్పుడే యిద్దరు ప్రవక్తలు అతిథులుగా వచ్చారు. వారికి ఈయడానికి గురువుగారు మూడు వేల వెండి నాణాలు, రెండు జతల పట్టుబట్టలు ఈయవలసిందిగా నిన్ను అర్థిస్తున్నారు అని బొంకాడు. నామాను ఉదారంగా అతడు అడిగిన దానికి రెండంతలు అదనంగా యిచ్చాడు. గేహసీ ఆ కానుకలను తన యింటిలో దాచిపెట్టి ఏమి యెరగనట్లుగా గురువు దగ్గరికి వెళ్లాడు. ఎలీషా ఓయి!నీవు ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించాడు. అతడు నేనెక్కడికి వెళ్లలేదని మళ్లా రెండవసారి బొంకాడు. ప్రవక్త కోపించి నా మనసు నీతో వచ్చి నీవు చేసిన మోసమంతా చూచింది. నీవు ఆస్తులు సంపాదించాలనుకొన్నావు. నామానుకి సోకిన కుష్ఠ తరతరాల దాక నిన్ను నీ వంశీయులను పట్టిపీడిస్తుందిపో అన్నాడు. గేహసీకి వెంటనే కుష్ఠ సోకింది. ఇక అతడు తన వంశీయులకు ఆస్తులను గాక కుష్ఠ రోగాన్ని వారసంగా యిస్తాడు.